

చిత్తూరు ఎస్‌డీపీవోగా శ్రీనివాసమూర్తి



శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఇటీవల కాలంలో జరిగిన డిఎస్‌పిఎస్ ట్రాన్స్‌ఫర్స్‌లో కె.శ్రీనివాస మూర్తికి చిత్తూరు సబ్‌డివిజినల్ ఆఫీసర్ (ఎస్‌డిపిఓ)గా కేటాయించబడినది. శ్రీనివాసమూర్తి ఇంతకు మునుపు చిత్తూరు క్రైమ్ పోలీస్‌స్టేషన్ డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తూ బదిలీ అయ్యి చిత్తూరు జిల్లా సబ్‌డివిజినల్ ఆఫీసర్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు, కడప, తిరుపతి అర్బన్ పోలీసు జిల్లాల నందు విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత మర్యాద పూర్వకంగా చిత్తూరు ఎస్పీని, ఇతర ఉన్నత అధికారులను కలిశారు.

బోగస్ ఓట్ల కలకలం..!

- ఒకే రోజు 1.29లక్షల ఓట్లు నమోదు
- అంతటా అనుమానాలు
- విచారణకు పిడిఎఫ్ ఎంఎల్‌సిల డిమాండు

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి:

తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గంలో దొంగోట్ల కలకలం రేగింది. ఒకే రోజు 1.29లక్షల ఓట్లు నమోదు కావడంపై అంతటా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ అండదండలతో అధికారులు అడ్డదారులు తొక్కి ఓట్లు నమోదు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై విచారణ చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు డిమాండు చేస్తున్నారు.

తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజక వర్గాలకు సంబంధించి ఓటర్ల నమోదు వ్యవహారం రసాబాసగా మారుతోంది. చరిత్రలో ఎన్నడూ కనివినీ ఎరుగని రీతిలో ఈసారి ఈనియోజకవర్గంలో 3.95లక్షల మంది ఓటర్లు తమ ఓటును నమోదు చేసుకున్నారు. చివరి రోజు లక్ష మందికి పైగా ఓటర్లు నమోదు కావడం గమనార్హం. అధికార పార్టీ నాయకులు, కొందరు అధికారులతో కలిసి కుమ్మక్కై భారీగా దొంగ పట్టభద్రులను నమోదు చేయించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇక సవరణల సమయంలో మరింత మంది ఇందులో చేర్పించేందుకు వైసిపి కుట్ర చేస్తోందనే ఆరోపణలు కూడా మిన్నంటుతున్నాయి. అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా చూస్తే దాదాపు నాలుగు లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తూర్పు రాయలసీమ ప్రాంత పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజక వర్గానికి సంబంధించి అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతున్న విషయం విధితమే. తొలి 15 రోజులు నిలకడగా సాగుతూ వచ్చింది. అయితే చివరి వారం రోజులు ఈ సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఒకరోజు ముందు 2.66 లక్షల మందికిపైగా పట్టభద్రులు తమ ఓటును నమోదు చేయించుకున్నారు. అయితే చివరి రోజు ఓటరు జాబితా పోటెత్తింది. ఏకంగా 1.25 లక్షల మందిని అధికార పార్టీ దొంగ పద్ధతిలో తమ అనునాయులను పట్టభద్రులుగా తమ ఓటు హక్కును నమోదు చేయించారు.

రికార్డు స్థాయిలో..

తూర్పు రాయలసీమలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది పట్టభద్రులు, 12వేల మంది దాకా ఉపాధ్యాయులు ఉంటారు అనేది అంచనా. అయితే 20వ తేదీ వరకు ఆయా ప్రాంతాల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటర్ల నమోదు కార్యక్రమం నత్తనడకన సాగింది. 20రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఊపందుకోలేదు.

ఆయా ప్రాంతాల్లో 20వ తేదీ వరకు ఫాం18ను ఆన్‌లైన్‌లో 55,262 మంది. నేరుగా 9767 మంది నమోదు చేసుకున్నారు. ఇలా మొత్తంగా 67,598 మంది మాత్రం చేసుకున్నారు. ఇక ఉపాధ్యాయుల్లో ఆయా జిల్లాల్లో మొత్తం 1187 మంది నమోదయ్యారు. అయితే వారం రోజుల నుంచి నమోదు ప్రక్రియ పూర్తిగా మారిపోయింది.

ఆరో తేదీ వరకు ఆరు జిల్లాల పరిధిలో పట్టభద్రులు 198695 మంది ఆన్‌లైన్‌లో, 67312 మంది నేరుగా మొత్తం 2,66,007 మంది ఓట్లు నమోదు చేసుకున్నారు. అయితే సోమవారం ఒక్కరోజుకే 3,95,383 మంది నమోదు చేసుకున్నారు. ఇది ఎలా సాధ్యమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఉపాధ్యాయుల్లో అయితే ఆరో తేదీ వరకు 12,815 మంది నమోదు చేసుకున్నారు. వీరి సంఖ్య ఒక్కరోజుకే 24712కు పెరిగింది. ఏకదాటిగా 11,897కు పెరిగిపోయింది. ఇలా భారీగా నమోదు కావడంపై పిడిఎఫ్ ఎంఎల్‌సిలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బల్క్‌గా వచ్చిన అప్లికేషన్లపై తనిఖీ చేయాలని వారు డిమాండు చేస్తున్నారు.

చిరుతని చంపిన వేటగాళ్ల అరెస్టు

- చిరుతపులి ఎముకలు, దుప్పి కొమ్ములు స్వాధీనం
- రెండు నాటు తుపాకులు, ద్విచక్ర వాహనాలు సీజ్



వేటగాళ్ల అరెస్టు చూపుతున్న జిల్లా అటవీ శాఖ అధికారి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిరుతపులిని వేటాడి చంపిన ఐదుగురు వేటగాళ్లను జిల్లా అటవీ శాఖాధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు చిత్తూరు జిల్లా డిఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చిత్తూరు జిల్లా అటవీశాఖ పశ్చిమ విభాగం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎఫ్ఓ నిందితులను చూపి వివరాలను వెల్లడించారు. యాదమరి మండలం దిగువ కణతల చెరువు గ్రామానికి చెందిన గంగాధరం (31), చిత్తూరు రూరల్ మండలం మర్రిగుంత గ్రామానికి చెందిన ధనశేఖర్ (27), తోప్పాతిపల్లికి చెందిన మధుసూదన్ (30), అనే ముగ్గురు నిందితులు కలిసి గుడిపాల మండలం చుక్కావారిపల్లికి చెందిన బాసు (21), యాదమరి మండలం గొందివాళ్ళఊరుకు చెందిన రుద్రన్ అనే వ్యక్తుల వద్ద రూ.5వేల నుంచి రూ.15 వేల వరకు వెచ్చించి రెండు సంవత్సరాల క్రితం నాటు తుపాకులు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఈ తుపాకులతో యాదమరి మండలంలోని కీనాటంపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో రెండేళ్లక్రితం వేటకువెళ్లి చిరుతపులిని చంపి వాటి కాలిగోళ్లను పంచుకున్నారని వెల్లడించారు. పులి కళేబరాన్ని మాత్రం క్వారీ లోయలో పడేసి వెళ్లిపోయారన్నారు. ఈ క్రమంలో మధుసూదన్ అప్పట్లో తాను నాటు తుపాకితో చంపిన చిరుత పులితో ఫోటో దిగాడన్నారు. సంబంధిత ఫోటో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన నేపథ్యంలో... ఆఫోటో ఆధారంగా రెండేళ్ల క్రితం చంపబడ్డ చిరుతపులి వివరాలను ఛేదించగలిగామన్నారు. అందులో భాగంగా బాధ్యులైన నిందితులు 5 మందిని అరెస్ట్‌చేసి, వారి వద్ద నుంచి పులిగోరు, ఎముకలు, ఇతర అవశేషాలు, దుప్పి కొమ్ములు, ఒక మచ్చు కత్తి, రెండు నాటు తుపాకీలు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసామన్నారు నిందితులను కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు. వన్యప్రాణులను వేటాడడం నిషేధమని, అందుకు విరుద్ధంగా ఎవరైనా వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వేటగాళ్లు, నాటు తుపాకులు ఉన్న వారి వివరాలను అటవీశాఖ ఉద్యోగులకు గాని, స్థానిక పోలీసులకు గాని తెలియజేయాలని కోరారు. అలా వివరాలు తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో ఎఫ్ఆర్ఓ బాలకష్ణారెడ్డి, డివైఎఆర్ఓ స్వప్నకుమారి, ఎఫ్ఎస్ఓ హరికుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రెడ్డిప్రసాద్, గణేష్ బాబు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



రెండేళ్ల క్రితం చిరుతని వేటాడి చంపిన వేటగాడు (ఫైల్ ఫోటో)

ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక ఆగకూడదు: జేసీ




ఇసుక సరఫరా పై అధికారులతో సమీక్షిస్తున్న జేసీఎస్.వెంకటేశ్వర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ ప్రాధాన్యతాపనులకు సంబంధించి ఇసుకను నిరంతరాయంగా సరఫరా చేయాలని, రీచ్‌ల వద్ద నుంచి ఇసుక సరఫరా చేసేలా చూడాలని జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. జెసి మంగళవారం నాడు జిల్లాలో ఇసుక లభ్యత సరఫరా గురించి అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత గ్రామాలలో భవన నిర్మాణాలకు ఇవ్వడం జరుగుతుందని ఇందులో ప్రధానంగా సచివాలయాలు రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, బిఎంసియులకు ఇవ్వడం జరుగుతుందని, ఈ భవననిర్మాణాలకు ఎట్టిపరిస్థితులలోనూ ఇసుక సరఫరా ఆగకూడదని అన్నారు. అలా జరిగితే దీని ప్రభావం నిర్మాణ పనులు వేగవంతంపై ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న కార్యక్రమాలలో ప్రభుత్వ కార్యాలయ భవననిర్మాణాలు అత్యంత ప్రాధాన్యమున్నవని తెలిపారు. ఈ నిర్మాణాలకు వెళ్లే ఇసుక రవాణాలో ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదని అన్నారు. ప్రధానంగా మైనింగ్, పోలీసులు, రవాణాశాఖ అధికారులు సమన్వయంతో భవన నిర్మాణాలకు కావాల్సిన ఇసుకను సరఫరా అయ్యేటట్లు చూడాలన్నారు. నాడు- నేడు పనులకు సంబంధించి ఇండెంట్ వచ్చిన వెంటనే సంబంధిత పాఠశాలలో దంపు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు వచ్చిన ఇండెంట్‌ల ప్రకారం ఇసుక సరఫరా చేయాలని సమీపంలోని ఇసుక రీచ్‌ల నుంచి సరఫరా అయ్యేటట్టు చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి బసిరెడ్డి, డిడిమైన్స్ ప్రసాద్, ఏడిమైన్స్ అధికారులు వేణుగోపాల్, ప్రకాష్ కుమార్, పోలిరెడ్డి, జేపీ వెంచర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సచివాలయంలో జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మంగళవారం జిల్లా పరిషత్ సీఈవో ప్రభాకర్‌రెడ్డి 15వ డివిజన్ వార్డు సచివాలయంలో అభివద్ధి పథకాలు, స్కీములు, లబ్ధిదారుల జాబితా తెలిపే డిస్ప్లేబోర్డులను, పలు రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి సచివాలయ సిబ్బంది యూనిఫారం తప్పక ధరించి, విధులకు నిర్ణీత వేళలందు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. వార్డు సచివాలయ సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో క్యాంపు వివరాలు నమోదు చేయలేదని, పలు రిజిష్టర్లును అప్డేట్ చేయలేదని ప్రతి ఒక్కరూ క్యాంప్ వివరాలను మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని వార్డు సచివాలయ సిబ్బందికి జడ్పీ సీఈఓ ఆదేశించారు. అనంతరం ప్రశాంత్‌నగర్‌లో నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్‌కాలనీ నిర్మాణ పనులను పరిశీలించి, పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలిన్స సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో 15వ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశాంత్ నగర్ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో

న్యాయవాద సంఘం ఎన్నికలకు 21 నామినేషన్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు న్యాయవాద సంఘం ఎన్నికల్లో పోటీ చేయడానికి 21 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారి ఎంఎస్.యోగానంద్ తెలిపారు. మంగళవారం చిత్తూరు బార్ అసోసియేషన్ వద్ద నామినేషన్లు స్వీకరించారు. ఇప్పటివరకు అధ్యక్షపదవికి డి.రాజేంద్రరెడ్డి, ఎం.చంద్రశేఖర్, పి.రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి యు.విశ్వనాథ్, జిఆర్.గిరిధరన్, ఎం.ఆనంద్, ప్రధాన కార్యదర్శి పదవికి పి.అశోక్ ఆనంద్ యాదవ్, కె.జానకి రామరెడ్డి, పి.లోకనాథం, కె.సత్యమూర్తి, సంయుక్త కార్యదర్శిపదవికి ఎస్.ఆనందన్, సి.సుధాకర్ తమనామినేషన్లను అందజేశారు. కోశాధికారి పదవికి కె.వరదరాజులు, గ్రంథాలయ కార్యదర్శిగా జి.ఎం.షఫీవుల్లా, సాంస్కతిక కార్యదర్శి పదవికి వి.దేవరాజులు నాయుడు, క్రీడా కార్యదర్శిగా సి.సుబ్రహ్మణ్యం నామినేషన్లు దాఖలు చేశారు. కార్యవర్గ సభ్యుల పదవికి బ్రహ్మాజీ, శివయ్య, జె.మహేష్, ఇసివి వెంకటరమణ నామినేషన్లను అందజేసినట్లు ఎన్నికల అధికారి ఎంఎస్ యోగానంద్ తెలియజేశారు.

రాష్ట్రంలో ప్రథమం..!

- నాడు- నేడు పనులు వేగవంతం
- రూపు మారుతున్న ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి- చిత్తూరుప్రతినిధి:

నాడు-నేడు రెండో విడత పనుల్లో జిల్లా దూసుకుపోతోంది. అత్యధిక పనులు చేసి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. దీన్ని ఇలాగే కొనసాగించి మరింత వేగంగా పనులు చేయాలనే ఉద్దేశంలో జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో ర్యాంకులు రావడంతో అధికార యంత్రాంగంలో ఉత్సాహం కనిపిస్తోంది.



శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వపాఠశాలలో దశలవారీగా కార్పొరేట్ స్కూల్‌స్థాయికి తీసుకురావడం, మంచి పౌష్టికాహారాన్ని అందిస్తూ పరిపుష్టి గల పిల్లలను తయారు చేయడం, పాఠ్య పుస్తకాలతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టిన విషయం విధితమే. మన బడి నాడు- నేడు కార్యక్రమానికి 2019, నవంబర్ 19న రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పాఠశాలలను అభివద్ధి చేసి విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఇవి ప్రభుత్వ పాఠశాలలా లేక కార్పొరేట్ స్కూల్స్ అని ఆశ్చర్య పోయే విధంగా రూపురేఖలు మార్చుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మనబడి నాడు- నేడులో మొదటి విడతలో 1,533 పాఠశాలలలో రూ.354కోట్లతో 11,245 పనులు చేపట్టగా ఇప్పటివరకు రూ.320 కోట్లు ఖర్చుచేశారు.

రెండో విడతలో చిత్తూరు జిల్లాలో 1183 పాఠశాలలు, 30 జూనియర్ కళాశాలలలో పనులు మంజూరయ్యాయి. రూ.424.10 కోట్లు అంచనాతో వ్యయంతో పనులు చేపట్టారు. ఇందులో పాఠశాలలకు సంబంధించి 1180పాఠశాలలో పనులు ప్రారంభమయ్యాయి. దీనికి ఇప్పటి వరకు రూ.75.01కోట్లు ఖర్చు పెట్టారు. 30 జూనియర్ కళాశాలల్లో పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు రూ.2.90కోట్లు ఖర్చుపెట్టారు. నాడు-నేడులో భాగంగా నిరంతరం నీటి సరఫరాతో మరుగుదొడ్లు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్స్‌తో కూడిన విద్యుదీకరణ, శుద్ధి చేసిన తాగునీటి సదుపాయం, పిల్లలు, ఉపాధ్యాయులు తరగతి గదులకు ఫర్నిచర్ ఏర్పాటు, రంగులు వేయుట, మేజర్ మరియు మైనర్ మరమ్మతులు, చాక్ బోర్డ్స్ ఏర్పాట్లు, ఇంగ్లీష్ ల్యాబ్, ప్రహరీ గోడల నిర్మాణం, వంట గదుల నిర్మాణం లేదా మరమ్మతులు, తరగతి గదుల నిర్మాణం, అంగన్వాడీ కేంద్రాల రిపేర్లు ఆట వస్తువుల కొనుగోలు చేపట్టారు.

నియోజకవర్గాల వారీగా..

చిత్తూరు నియోజకవర్గంలో 75పాఠశాలల్లో రూ.2586.89 లక్షలు, జీ.డీ.నెల్లూరు నియోజకవర్గంలో 170పాఠశాలల్లో రూ.5099.74 లక్షలు, కుప్పం నియోజకవర్గంలో 267 పాఠశాలల్లో రూ.10148.26 లక్షలు, నగరి నియోజకవర్గంలో 90పాఠశాలల్లో రూ. 2903.41 లక్షలు, పలమనేరు నియోజకవర్గంలో 292పాఠశాలల్లో రూ.11485.22 లక్షలు, పూతలపట్టు నియోజకవర్గంలో 125 పాఠశాలల్లో రూ.3907.53 లక్షలు, పుంగనూరు నియోజకవర్గంలో 194 పాఠశాలల్లో రూ. 6279.57 లక్షలు.

పాఠశాలల రూపురేఖలు మారి పోయాయి



రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అందులో భాగంగా మన బడి నాడు -నేడు కార్యక్రమంతో విప్లవాత్మక సంస్కరణలతో పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. రెండో విడత పనులు కూడా జిల్లాలో వేగతంగా సాగుతున్నాయి. దీంతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాం.

- యం.హరి నారాయణన్, జిల్లా కలెక్టర్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం




ప్రభుత్వ పాటశాలల బలోపేతానికి మనబడి, నాడు-నేడు కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ స్థాయిలో తీర్చిద్దిదేందుకు తీసుకోని వచ్చిన నాడు నేడు కార్యక్రమం అవసరమైన వసతులను ఏర్పాటు చేసి పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకొచ్చేటట్లు అయ్యింది. వి.కోట మండలం లో 2వ విడతలో 100 ప్రాజెక్టులు, శాంతిపురం మండలం 54 ప్రాజెక్టులు మంజురై పురోగతిలో పనులున్నాయి. **- చంద్రశేఖర్, ఎంఈఓ**

గ్రానైట్ వ్యర్థాలను రోడ్ల పక్కన పడేస్తే చర్యలు

మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి వెలువడే వ్యర్థాలను రోడ్లకు ఇరువైపులా వేయకూడదని, దీనివల్ల ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ఫ్యాక్టరీల యజమానులు దీనికి సంబంధించి తగు నిర్ణయం తీసుకోవాలని మైనింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ అన్నారు. కట్టమంచి బాలకష్ణారెడ్డి మ్యాంగో భవన్‌లో మంగళవారం ఉదయం మైనింగ్, పొల్యూషన్ అధికారులు గ్రానైట్‌ఫ్యాక్టరీల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మైనింగ్‌శాఖ డీడీ మాట్లాడుతూ ఇటీవల జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ నిర్వహించిన సమావేశంలో గ్రానైట్ వ్యర్థాలు రోడ్ల వైపు వేయడం వల్ల ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెప్పడం జరిగిందని ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు అందరూ ఫ్యాక్టరీ యజమానులు సహకరించాలని అన్నారు. జాతీయ రహదారుల వైపు కూడా ఈవ్యర్థాలను వేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక స్థలం ప్రత్యేకించి డంపింగ్ కోసం ఏర్పాటు చేయడం జరుగుతుందని రెవెన్యూ అధికారులతో కలిసి ఈ నిర్ణయం తీసుకొని ఉన్నామని తెలిపిన మైనింగ్ అధికారులు అంతవరకు ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతాలలో డంపింగ్ చేసుకోవాలని రోడ్ల వైపు వేయకూడదని అన్నారు. జాతీయ రహదారులు వెళ్లే సమయంలో వాహనాలు వేగంగా వెళ్లడం జరుగుతుంటుందని అయితే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఈ గ్రానైట్ వ్యర్థాలు తగిలి మరింత మంది గాయపడటం కానీ లేదా మరణించడం కానీ జరుగుతోందని తెలిపారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని ఆ మేరకు ఫ్యాక్టరీ యజమానులు కూడా సహకరించి తగు నిర్ణయం తీసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్, ఏడీలు వేణుగోపాల్ ప్రకాష్ కుమార్, నరేంద్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నరేంద్రబాబు, మైనింగ్ శాఖ డిడి ప్రసాద్, మైనింగ్ శాఖ ఏడీలు ప్రకాష్ కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



యజమానులతో మాట్లాడుతున్న మైనింగ్ శాఖ డీడీ ప్రసాద్

అంగన్వాడీలపై వేధింపులు మానుకోవాలి

ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ప్రాజెక్టులో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ప్రాజెక్టు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ధర్నాకు ప్రాజెక్టు కార్యదర్శి శ్యామల అధ్యక్షత వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ అంగన్వాడీలపై అధికారుల నిర్లక్ష్య వైఖరి మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా ప్రాజెక్టులో అధికారుల వ్యవహరిస్తున్నారని తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కార్యాలయంలో అనేక రకాల అక్రమాలు జరుగుతున్న పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సెంటర్లకు సంబంధంలేని బయట వ్యక్తులు వచ్చి పర్యవేక్షణ చేస్తుంటే ఐసిడిసి అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ఐసిడిఎస్ అధికారులు ఆదేశాలిస్తూ స్థానిక సంస్థలు పరిష్కారం కోసం ప్రాజెక్టు స్థాయిలో నెలకొకసారి జాయింట్ సమావేశం జరపాలని ఉన్న పలమనేరులో ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు. వెంటనే జాయింట్ సమావేశం నిర్వహించి స్థానిక సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. వర్కర్ల మధ్య చిచ్చు పెడుతూ అధికారుల పబ్బం గడుపుతున్నారని దీని మానుకోవాలి అన్నారు. జిల్లా పిడి వెంటనే స్పందించి పలమనేరు ప్రాజెక్టులో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో పోరాటం ఉదతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ నాయకులు అనిత, జీవిత, సుజన లతోపాటు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గిరిధర్ గుప్తా, ఐద్వా జిల్లా నాయకురాలు భువనేశ్వరి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

అత్యంత పారదర్శకంగా
గ్రామసభలు నిర్వహించాలి



స్వామి మిత్ర సర్వేపై మాట్లాడుతున్న జేసీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వామి మిత్రా సర్వే వేగవంతంగా నిర్వహించడం జరుగుతోందని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కమిషనర్ కోనశశిధర్ వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 95 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ రావడం జరిగిందని, 74 గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ జరుగుతోందని, 14గ్రామాలలో గ్రౌండ్ వాలిడేషన్ జరుగుతోందని, మరో రెండు గ్రామాల్లో13 నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందనీ, 5గ్రామాల్లో చర్యలు ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. గ్రౌండ్ ట్రూతింగ్ నిర్వహించే సమయంలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని, ఈ గ్రామ సభలలో సంబంధిత అధికారులు అందరూ పాల్గొని ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలిపారు. దీనికి సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిపిఓ లక్ష్మి, డిఐ గణేష్‌లు పాల్గొన్నారు.

ఎంఐజీ లేఅవుట్లు వారంలోపు పూర్తి చేయండి

జాయింట్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు ఎంఐజి లేఅవుట్లను ఏర్పాటు చేయాలని భావిస్తోందని, ఇప్పటికే అందుకు సంబంధించి స్థలనిర్ణయం అయిందని, సేకరణ వేగవంతంగా చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. జాయింట్ కలెక్టర్ మంగళవారం చుడా విసి, ఆర్డీవోలు, సంబంధిత తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ చిత్తూరుకు సంబంధించి తిమ్మసముద్రం, పలమనేరుకు సంబంధించి మొరం, పుంగనూరుకు సంబంధించి రాగానిపల్లి, నగిరికి సంబంధించి కీలపట్టు, పూతలపట్టుకు సంబంధించి వడ్డేపల్లి, గంగాధరనెల్లూరుకు సంబంధించి గంగాధరనెల్లూరు పంచాయతీలో భూములను సేకరించాలని ప్రభుత్వం భావించిందన్నారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలను వారం లోపల తయారుచేసి పంపాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో రేణుక నగిరి ఆర్డీఓ సజన, చుడా విసి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకు పీఆర్‌టీయూ అభినందనలు



డీఈవోను కలిసిన యాదమరి పీఆర్‌టీయూ యూనియన్ నేతలు

ప్రజాశక్తి -యాదమరి: చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి విజేయేంద్రరావును మంగళవారం మర్యాద పూర్వకంగా యాదమరి మండల పీఆర్‌టీయూ టీచర్స్ యూనియన్ సభ్యులు కలిశారు. డీఈవోకు అభినందనలు తెలిపారు. అనంతరం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గిరిప్రసాద్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శులు హిమబిందు, షహనాజ్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివప్రసాద్, సురేష్‌రెడ్డి, ఆనంద్ పిళ్లై, తులసీప్రసాద్, సర్వరత, హరికృష్ణ, అఖిల భాను, ఆరిఫ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ మండల కమిటీ ఎన్నిక




ప్రజాశక్తి - గంగవరం: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నూరి ఈశ్వర్ ఆధ్వర్యంలో గంగవరం మండలం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. వారిలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎం.మునిరత్నం, పాకాల సుబ్రహ్మణ్యం, కోశాధికారి గౌరప్ప, కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్, శివానంద సుబ్రహ్మణ్యం గంగప్ప, ప్రభాకర్, ఎం.వెంకటేష్, డి.వెంకటేష్‌లను ఎన్నుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పాకాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కమిటీ తనను గౌరవించి తనకు అప్పగించిన అధ్యక్ష పదవిని వినియోగించుకుంటూ బడుగు బలహీన వర్గాల వారికి తమ వంతు సాయం చేసి మండలంలో దళితులకు ఏ సమస్య ఎదురైనా దగ్గరుండి ఆ సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే మండలంలో దళితులకు శ్మశాన సమస్యలు, భూ సమస్యలు అనేక సమస్యలు ఉన్నాయని పంచాయతీలలో పర్యటించి దళితవాడలో ఉన్న సమస్యలను పసిగట్టి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

గ్రామాల్లో ఇంటింటికీ వైద్యసేవలు



పద్మసరస్సులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రజా ఆరోగ్యం కోసమే ప్రభుత్వం గడపవద్దకు వైద్య సేవలు అందిస్తోందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ అన్నారు. మంగళవారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం సచివాలయం 3 పరిధిలోని పద్మసరస్సు ఎస్టీ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దీర్ఘ కాలిక రోగాలతో బాధపడుతున్న రోగులను కలిసి నిత్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు అందించారు. అదే విధంగా ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించడానికి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందిన వారికి కూడా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే వైద్య శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు, బాలింతలకు కూడా వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది. ఆశావర్కర్లు పలువురు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన



ప్రజాశక్తి -రొంపిచెర్ల: మండలంలోని మోటుమల్లెల గ్రామ పంచాయతీలో నూతనంగా మంజూరైన లో ఓల్టేజి సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను మంగళవారం జెడ్పిటిసి రెడ్డిశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృషితో రూ.5 కోట్లు ప్రభుత్వ నిధులతో బండకిందపల్లి, మోటుమల్లెల గ్రామ పంచాయితీలల్లో లో వోల్టేజి సబ్‌స్టేషన్లను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్ శేఖర్, సర్పంచ్ జీవలత, ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్ రెడ్డి, వైసీపీ నాయకులు శ్రీధర్, ఉమాపతి రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు బిందు సేద్యం పరికరాలు అందించాలి

- జిల్లా ఏపీఎంఐపీ పీడీ మధుసూదన్ రెడ్డి



ప్రజాశక్తి-చౌడేపల్లె : రైతులకు త్వరితగతిన బిందు సేద్యం పరికరాలను అందించాలని చిత్తూరు జిల్లా ఏపీఎంఐపీ పీడీ మధుసూదన్ రెడ్డి డీలర్లను ఆదేశించారు. మంగళవారం చౌడేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో పుంగనూరు నియోజకవర్గం ఏపీఎంఐపీ డ్రిప్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిప్ పరికరాల కోసం నమోదు చేసుకున్న రైతులందరికీ సకాలంలో డ్రిప్ పరికరాలను అందించాలన్నారు. ముందుగా పుంగనూరు నియోజకవర్గం రైతులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఎంఐపీ ఏపీడీ రమణారెడ్డి, ఉద్యానవనశాఖ అధికారిణి సంతోషి కుమారి, ఎంఐఏవో గాయత్రి, వివిధ కంపెనీలకు చెందిన డ్రిప్ డీలర్లు పాల్గొన్నారు.

ఇవిగో సమస్యలు.. పరిష్కరించరూ..!

నేడు మండల సర్వసభ్య సమావేశం



ప్రజాశక్తి-వి.కోట: వి.కోట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. మండలంలో ఏకపక్షంగా నిర్వహిస్తున్న సమావేశంలో సభ్యులు సమస్యలపై స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. అర్హులకు ఇంటి స్థలాలు అందించాలని.. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని.. భూ సర్వే లో రైతులకు కలిగిన ఇబ్బందులను పారదర్శకంగా పరిష్కరించాలని, ప్రభుత్వ స్థలాలను పక్కాగా గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో పశసంవర్ధకశాఖలో వైద్యుల కొరతను తీర్చాల్సిన అవసరం ఉంది. వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ అంతర్గత రహదారులను అధికారులు గుర్తించి మరమ్మతులు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించింది. అటవీ సరిహద్దు గ్రామాల్లో వేటగాళ్ల బారి నుంచి వన్యప్రాణులను రక్షించాలి. వన్యప్రాణుల నుంచి పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించేందుకు అటవీశాఖ సిబ్బంది చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వి.కోట మండలానికి మంజూరైన బైపాస్ రోడ్డును మొదట్లో ప్రతిపాదించిన మేరకు వి.కోట మండలం మీదుగానే వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి. జీడిగుట్ల వద్ద వ్యవసాయ మార్కెట్ కు కేటాయించిన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలి. గతంలో ప్రతిపాదించిన మేరకు రెస్కో సొంత నూతన కార్యాలయానికి భవనాన్ని ఏర్పాటు చేయాలి. మండలంలో మద్యం బెల్టు షాపులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


దారి సమస్య పరిష్కరించాలని ఆత్మహత్యాయత్నం



ప్రజాశక్తి-శాంతిపురం: తన పొలానికి దారి సౌకర్యం కల్పించాలని ఏడాదిగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఉపయోగం లేకపోవడంతో రైతు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం శాంతిపురం మండల సచివాలయం వద్ద జరిగింది. చెంగుబల్ల గ్రామానికి చెందిన రైతు మాజీ సర్పంచ్ గోపాల్‌కు గ్రామ సమీపంలో ఉన్న సోగడపల్ల పెద్దచెరువు వద్ద ఉన్న పొలాలకు వెళ్లడానికి దారిని అదే గ్రామానికి చెందిన మరో రైతు ఆక్రమించుకోవడంతో తన పొలానికి దారి సౌకర్యం లేకుండాపోయింది. దీంతో ఏడాదిగా శాంతిపురం తహశీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతూ పలుమార్లు విన్నవించు కున్నారు. న్యాయం జరగలేదని తన వెంట తెచ్చుకున్న తాడుతో మండల సచివాలయ గుమ్మానికి ఉరేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తహశీల్దారు లోకేశ్వరరావు, ఆర్ఐ మధు సమస్యను పరిష్కరిస్తామని గోపాల్‌కు హామీ ఇచ్చారు. ఆక్రమణలను తొలగించి దారి సౌకర్యాన్ని కల్పిస్తామని తెలిపారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



ప్రజాశక్తి-బంగారుపాళ్యం : విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన పసల భరత్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు కంప్యూటర్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కంప్యూటర్‌పై అవగాహన పెంచుకోవాలని.. ప్రపంచం కంప్యూట రీకరణ అవుతోందన్నారు. గ్రామానికి చెందిన దాత పసల భరత్ కుమార్ ఒడ్డి ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులకు కంప్యూటర్ అందజేయడం హర్షణీయ మన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ సోమశేఖర్, ఎంఈవో నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రమేష్, మాధవనాయుడు, మాజీ సర్పంచ్ అన్నామలరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే అంటువ్యాధులు దూరం

- జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు



ప్రజాశక్తి-యాదమరి: దోమల వ్యాప్తిని అరికడితేనే అంటువ్యాధులు రాకుండా నివారించవచ్చని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం యాదమరి మండలంలోని దాసరపల్లి ఆదిఆంధ్ర వాడలో డీఎంవో రామచంద్ర అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి విచ్చేసిన జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని.. ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని.. కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. పగటి పూట కుట్టే దోమల కారణంగా డెంగ్యూ జ్వరం బారిన పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ పీర్ సాహెబ్, ఆరోగ్య కార్యకర్తలు కుమారి, రమాదేవి పాల్గొన్నారు.

పాఠశాలలో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలి




వినతిపత్రం అందిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలని టిఎన్ఎస్ఎఫ్ నేతలు మంగళ వారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు ప్రభుతేజ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం మెరుగైన మధ్యాహ్న భోజనం ఇచ్చే లాగా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ పాఠశాలలో అగ్నిమాపకశాఖ వారి పరికరాలు మరియు అనుమతులు పొందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. నాడు- నేడు పనుల్లో చాలాచోట్ల అక్రమాలకు పాల్పడుతున్నారని, దానిని వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ విద్యా సంస్థల్లో నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న వాహనాలను సీజ్ చేయాలని, ఇంకా కొన్ని బస్సుకి ట్రాన్స్పోర్ట్ అథారిటీ నుంచి ఫిట్నెస్ సర్టిఫికెట్ ఉండేలాగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ ప్రధానకార్యదర్శి బాలాజీ, కార్యదర్శులు సాయి, ఈశ్వర్, గుడిపాల మండల అధ్యక్షుడు శ్యాంప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ గిరీష్ చౌదరి అతిథులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనంరిజిస్ట్రేషన్లకు మరో అవకాశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పాస్టర్లకు నెలకు రూ.5వేల గౌరవ వేతనం అందించేందుకు మొదటి విడతలో రిజిస్ట్రేషన్ చేసుకోలేని వారికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు మైనారిటీ సంక్షేమశాఖ అధికారి చిన్నారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్చి సొసైటీ చట్టం క్రింద కానీ ట్రస్ట్ క్రింద కానీ నమోదు చేసి ఉండాలి. చర్చి స్థలం చర్చి పేరుతో నమోదు అయి ఉండాలి (లేదా) చర్చి భూమికి తహశీల్దార్ జారీ చేసిన స్వాదీన దవీకరణ పత్రం (లేదా) విఆర్ఒ, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వార్డువెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ద్వారా ఆ స్థలంలో చర్చి ఉంది అని చెప్పే వెరిఫికేషన్ సర్టిఫికేట్ (లేదా) సొసైటి లేదా ట్రస్ట్ పేరు మీద ఎవరైనా డోనర్స్ ఇచ్చిన రిజిస్టర్డ్ నోటరీ (లేదా) గిఫ్ట్ డీడ్, చర్చికి ఎటువంటి ఆదాయం లేదని చర్చి మేనేజ్ మెంట్ గానీ చర్చి పాస్టర్ గానీ ఇచ్చే సెల్ఫ్ డిక్లరేషన్ చర్చి పేరు మీద ఉన్న బ్యాంకు అకౌంటు, అద్దె భవనంలో నడుపుతున్న చర్చికి సొసైటి పేరు మీద గానీ/ ట్రస్ట్ పేరు మీద గానీ ఉన్న రెంటల్ లీజ్ అగ్రిమెంట్ లేదా నోటరైజ్డ్ అగ్రిమెంట్. పై తెలిపిన ప్రమాణాల ప్రకారం అర్హత కలిగిన పాస్టర్లు వారికి సంబంధించిన వివరములను వార్డు, గ్రామ వాలంటీర్ల ద్వారా మీకు సంబందించిన సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్ నందు ఈనెల 10వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏలు) సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి సాధించి తీరుతామని వీఆర్ఏ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోదండ, చిత్తూరు డివిజన్ అధ్యక్షులు పెరుమాళ్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక రెవెన్యూ భవనంలో వీఆర్ఏ సంఘం నూతన డివిజన్ అధ్యక్షుల ఎన్నిక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం డివిజన్ అధ్యక్షులుగా పెరుమాళ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం పెరుమాళ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతంగా అమలు చేసేందుకు తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తున్న వీఆర్ఏలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి కనీస వేతనం అమలు చేసే విధంగా చూడాలని కోరారు. ప్రస్తుతం వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇందులో భాగంగా వీఆర్ఏ సంఘం డివిజన్ అధ్యక్షులుగా తనను ఎన్నుకోవడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. వీఆర్ఏ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కష్ణమూర్తి, ప్రత్యేక కార్యదర్శి లలితకుమారి, డివిజన్ సెక్రటరీ వినయాగం, వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షులు బాలాజీరెడ్డి, చిత్తూరు డివిజన్ అధ్యక్షులు మార్కొండేయులు, ముఖ్యఅతిథి రెవెన్యూ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షులు విజయసింహారెడ్డి, సిఐటియు నాయకులు చైతన్య, వాడ గంగరాజు, ఎన్నికల అధికారి పద్మనాభం, అధిక సంఖ్యలో సంఘం నేతలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్‌లో వైద్య సిబ్బంది సేవలు భేష్



డాక్టర్ దుర్గాదేవిని సన్మానిస్తున్న సంస్థ అధ్యక్షుడు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: కోవిడ్ సమయంలో వైద్యులతోపాటు వైద్య సిబ్బంది సైతం ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలు అందించడం ఎంతో గర్వకారణమని ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ మండల ప్రెసిడెంట్ పాపిరెడ్డి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ దుర్గాదేవిని శాలువతో సన్మానించి జ్ఞాపిక అందించారు. ఏపీఎంవో కష్ణ, స్టాఫ్ నర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం అందరి బాధ్యత



వేల్కూరులో మహిళలకు మొక్కలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు సూరి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొక్కలు నాటడంతోనే పచ్చదనం మెరుగవుతుందని..ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని.. ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు పెంచాలని అధ్యాపకులు సూరి అన్నారు. గంగాధరనెల్లూరు మండలం వేల్కూర్ కొత్త దళిత వాడలో కాసా స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ కరుణాకరన్ సహకారంతో మంగళవారం గ్రామంలో పది రకాల పండ్ల మొక్కలను ఒక్కో కుటుంబానికి పది మొక్కలు చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాస సంస్థ సూపర్‌వైజర్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలో 2,392 మంది పట్టభద్రులు ఓటు కోసం నమోదు చేసుకున్నారని తహసీల్దారు బెన్‌రాజ్ తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టి ఓటర్లనమోదును నవంబర్ 23వ తేదీన ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



ప్రజాశక్తి-పులిచెర్ల: పీలేరు కడప రోడ్డులోని భాస్కర నేత్రాలయ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం పులిచెర్ల మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుగుణమ్మ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భాస్కర నేత్రాలయ వైద్యులు షౌకత్‌అలీ బాషా సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిచూపు సమస్య నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాధురి, సోనీ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం




ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డి గ్రామంలో రాముల వారి ఆలయ నిర్మాణానికి బైరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహతి ఫౌండేషన్ ఛైర్మన్ ఎన్.ఆర్.ఐ నాగరాజు రూ.లక్ష విరాళం అందించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసులు, గౌడు, గౌనీతిమ్మేపల్లి మంజునాథ్‌రెడ్డి, సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా వెరిఫికేషన్

డిసెంబర్ 23న ఫైనల్ జాబితా విడుదల: జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం 9వ తేదీ ఓటర్ల జాబితా ప్రకటించడం జరుగుతుందని..క్షేత్రస్థాయిలో ఆధార్, సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. హరి నారాయణన్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు గ్రామ సర్వేయర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాలలో ఓటర్ల జాబితాలను విడుదల చేయడం జరుగుతుందని.. సంబంధిత ఈఆర్‌వోలకు ప్రధాన కార్యాలయాల్లో ఉండే తహసీల్దారులు సహకరించాలన్నారు. మరోసారి డిసెంబర్లో ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందని దానికి సంబంధించి డిసెంబర్ 23న తుది జాబితా ఇవ్వడం జరుగుతుందన్నారు. నిబంధనల మేరకు పూర్తిచేసిన దరఖాస్తు ఫారంలను ఆన్లైన్లో వచ్చిన వాటిని ఆఫ్ లైన్లో వచ్చిన వాటిని కంప్యూటరీకరణ చేయాలన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్, డి ఆర్ ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.



రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: హోటల్‌ఉదయ్ ఇంటర్నేషనల్, తిరుపతిలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజును వెదురుకుప్పం మండలానికి చెందిన చిత్తూరు జిల్లా టిడిపి మాజీ కార్యదర్శి పి.మోహన్ మురళి ఆయనను కలిసి సన్మానించారు. మంగళవారం జోన్-4 ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, రాజంపేట చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాలకు చెందిన ఎస్సిల కార్యనిర్వాహక సమావేశం సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు యం.ఎస్.రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వెదురుకుప్పం మండల ఎస్.సి.సెల్ అధ్యక్షుడు వరప్రసాద్, నియోజకవర్గ ఎస్.సి.సెల్ కార్యదర్శి సుధాకర్, మండల ఐటిడిపి అధ్యక్షుడు కార్తిక్, మండల క్రిస్టియన్ అధ్యక్షుడు చొక్క మహేష్, నియోజకవర్గ ఐటిడిపి కార్యదర్శి అమరనాథ్, చంద్రశేఖర్, యెగీశ్వర్, శివ, వెంకటేష్, మురళి తదితరులు సన్మానం చేసిన వారిలో ఉన్నారు.

రాయితీతో డ్రిప్ పరికరాల పంపిణీ

ప్రజాశక్తి -గుడిపల్లి: 5 ఎకరాలలోపు భూమి ఉన్న రైతులందరూ కూడా 10శాతం మాత్రమే రైతుల వాటాగా చెల్లించి 90శాతం రాయితీ ద్వారా, ఐదు ఎకరాల కన్నా ఎక్కువ పొలం ఉన్న రైతులు 70 శాతం రాయతీతో డ్రిప్ పరికరాలు, ప్రభుత్వం ద్వారా ధ్రువీకరించిన కంపెనీల ద్వారా పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. సంగనపల్లిలో ప్రభుత్వం రాయితీ ద్వారా అందజేసిన డ్రిప్ పరికరాలు నాణ్యతను పరిశీలించారు. కావున మండలంలోని డ్రిప్ పరికరాలు అవసరమైన అర్హత ఉన్న రైతులు అందరు కూడా మీ 1బి, పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మీ రైతు భరోసా కేంద్రానికి వెళ్లి, మీకు కావలసిన కంపెనీ ఎంపిక చేసుకోవచ్చునని ఉద్యానాధికారి డింపు ప్రియ శ్రీ తెలిపారు. ముఖ్యంగా కూరగాయలు, పూలు, పండ్ల తోటలు, మల్బరి, ఇతర పంటలు వేసే రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పట్టు పరిశ్రమ అధికారి శ్రావణి తెలిపారు.

బోయకొండ గంగమ్మ ఆలయం మూత

ప్రజాశక్తి-చౌడేపల్లె : రాష్ట్రంలో రెండో ప్రముఖ శక్తి క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన చౌడేపల్లె మండలం దిగుపల్లి పంచాయతీలో వెలిసిన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయాన్ని చంద్రగ్రహణం ప్రభావంతో మంగళవారం మూసివేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ఈవో చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని అర్చకులు, వేదపండితుల సూచనల మేరకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఆలయాన్ని మూసివేశామన్నారు. తిరిగి బుధవారం గ్రహణానంతరం ఆలయ శుద్ధి, పూర్వ వచనము, గ్రహణ శాంతి, అభిషేకాల అనంతరం ఉదయం 7 గంటల నుంచి అమ్మవారి దర్శనం కొనసాగుతుందని తెలిపారు.

వేణుగోపాల స్వామి ఆలయం...

ప్రజాశక్తి-కార్వేటినగరం: చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని మంగళవారం ఉదయం 8.30 గంటలకు అర్చకులు సూపరింటెండెంట్ రమేష్ ఆధ్వర్యంలో ఆలయాన్ని మూసి వేశారు. అనంతరం 7.30 గంటలకు ఆలయాన్ని పునఃప్రారంభించారు. ఈ క్రమంలో భాగంగా ఆలయంలో శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఉభయ దేవేరులతో పాటు శ్రీవేణు గోపాల స్వామి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌బాబు, అర్చకులు గోపాలాచారి, భక్తులు పలువురు పాల్గొన్నారు.



నాణ్యతతో నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రభుత్వం చేపడుతున్న నాడు-నేడు పనుల్లో నాణ్యత లోపించకుండా నిర్మాణాలు చేపట్టాలని ఎస్.ఎస్ఏ ఈఈ మధుసూదన్ రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్కేవీబీ పేటలో నాడు- నేడు పథకం ద్వారా నిర్మాణం చేపడుతున్న ఉన్నత పాఠశాల అధనపు భవనాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్మాణాలను పటిష్ఠంగా ఉండేలా చూడాలని, నాడు -నేడు పథకం ద్వారా చేపట్టే నిర్మాణాలకు బిల్లులు ఎప్పటికప్పుడూ మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. ఆయన వెంట ఏఈ నాగభూషణం,ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకేష్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేష్, గంగాధరం పలువురు ఉన్నారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయించాలి



సచివాలయ, హౌసింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో

ప్రజాశక్తి-సోమల: మండలంలోని జగనన్న లేఔట్లలో లబ్ధిదారులు చేపడుతున్న గహ నిర్మాణాలను వేగవంతం చేయాలని.. సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నాగరాజు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే నిర్మాణాలు చేపట్టిన వారిని త్వరితగతిన పూర్తి చేసేలా ప్రోత్సహించాలని, నిర్మాణాలు చేపట్టని వారిని గుర్తించి గహ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.